సాక్షి ఒడిశా

శనివారం । 7 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 4.70.484
బంగారం: 450 మిల్లీ గ్రాములు
వెండి: 18 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



పోలవరంపై రభస

అసెంబ్లీలో పోలవరంపై రభస జరిగింది. ప్రభుత్వ తీరును విపక్షాలు ప్రశ్నించాయి.

-10లో



సేవలు మరువలేం

హోంగార్డుల దినోత్సవం ఘనంగా జరిగింది. వారి సేవలను ప్రశంసించారు.

-10లో

వైభవం.. మండయ్ ఉత్సవం



బందారు ఘరణి శక్తి పీఠం వద్ద మండయ్ ఉత్సవాలు



కాంతారా వేషధారణ

నబరంగ్‌పూర్ జిల్లా సాంస్కృతిక, గిరిజన ఉత్సవం మండయ్–24 జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలు ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం బందారు ఘరణి మందిరం వద్ద ప్రారంభ పూజలు చేశారు. కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో మండయ్ జ్యోతిని వెలిగించారు. జనసంద్రం మధ్య మెయిన్ రోడ్డులో భారీ ర్యాలీ జరిగింది. వివిధ సాంస్కృతిక బృందాలు, కళాకారులు నృత్యాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. రాజ్యసభ ఎంపీ మున్నా ఖాన్, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి, మనోహర్ రంధారి, నర్సింగ్ బోత్ర తదితరులు ఓపెన్ టాప్ జీప్‌లో ర్యాలీలో పాల్గొన్నారు.

– కొరాపుట్



బందారు ఘరణి శక్తి పీఠం నమూనాలో తయారు చేసిన ఉత్సవ వేదిక



దేవాలయం వద్ద కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో తదితరులు



గిరిజన నృత్యాలు చేస్తున్న యువతులు



ప్రత్యేక వాహనం మీద ప్రజలకు అభివాదం చేస్తున్న నాయకులు

న్యూస్‌రీల్

రొయిమతి ఘువురియకు డాక్టరేట్



రొయిమతికి డాక్టరేట్ అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జయపురం: సబ్ డివిజన్ కుంద్రా సమితి నువాగుడ గ్రామానికి చెందిన గోవింద ఘువురియ భార్య రొయిమతి ఘువురియ డాక్టరేట్ సాధించింది. వ్యవసాయ రంగంలో ఆమె సాధిస్తున్న విజయాలకు గానూ భువనేశ్వర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డాక్టరేట్ ప్రధానం చేస్తూ ఘనంగా సన్మానించారు. ఈమెకు పద్మశ్రీ దివంగత కమలా పూజారి పెద్దమ్మ అవుతుంది. దీంతో ఆమె ప్రభావం రొయిమతిపై ఉంది. ఆమె జయపురం పూల్‌బెడలోని ఎంఎస్ స్వామినాథన్ పరిశోధన కేంద్రం సహకారంతో శిక్షణ పొంది, తన సొంత భూమిలో 2002 నుంచి వ్యవసాయం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 70 రకాల దేశీ ధాన్యం వంగడాలను, 30 రకాల మండియ(చోడి) వంగడాలను సేకరించి వాటితో వ్యవసాయం చేస్తూ వాటిని సంరక్షిస్తోంది. ఆమె ఇదివరకే పలు అవార్డులు పొందడం విశేషం.

క్రీడలతో మానసిక ఆరోగ్యం



క్రీడా పతాకాలతో విద్యార్థులు

రాయగడ: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సౌమ్యరంజన్ కర్ అన్నారు. సికరపాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వార్షిక క్రీడోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాల హెచ్‌ఎం రంజిత్ కుమార్ గిరి మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రతి ఏడాది క్రీడలను నిర్వహించి క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు క్రీడలు జరుగుతాయి.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వే పట్టాల మీద టిపుల్ సునా మృతదేహం

కొరాపుట్: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సునాబెడ రోడ్ స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కొరాపుట్ జిల్లా సునాబెడా బాపూజీనగర్ కాలనీకి చెందిన టిపుల్ సునా(30) మృతి చెందాడు. సునాబెడా రోడ్‌స్టేషన్‌కి పోలీసులు చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారు.

36 వేల గంజాయి మొక్కల ధ్వంసం



గంజాయి మొక్కలను కాల్చివేస్తున్న దృశ్యం

రాయగడ: గంజాయి అక్రమ సాగు నివారణపై జిల్లా జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి సారించింది. ఇందులో భాగంగా గంజాయి వనాలను గుర్తించి దాడులు చేపట్టి ధ్వంసం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మధుబన్ పంచాయతీ రాచంలో గురువారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో 36 వేల గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో గంజాయి సాగవుతుందని సమాచారం అందుకున్న పోలీసులు ఈమేరకు దాడులను నిర్వహించి గంజాయి మొక్కలను తగులబెట్టారు.

ఆ...వేదన



పొట్ట పెరుగుతూ నొప్పికి భరించలేని సుదర్శన్

చిత్రంలోని బాలుడి పేరు సుదర్శన పొరజ. వయసు 8 ఏళ్లు. రోజురోజుకూ పొట్ట పరిమాణం పెరిగిపోతూ ఉండడంతో బాధ తట్టుకోలేక రోజూ నరకం చూస్తున్నాడు. తనకు వచ్చిన సమస్యను అర్థం చేసుకునే వయసు ఆ బాలుడికి లేదు. వ్యాధికి చికిత్స చేయించగలిగే స్థోమత అతడి తల్లిదండ్రులకు లేదు. దీంతో నిత్యం ఆ బాలుడు నొప్పితో తల్లడిల్లిపోతున్నాడు. జయపురం సమితి బరిణిపుట్ గ్రామ నివాసి అర్జున పూజారి బాలుడి తండ్రి. పొట్ట పెరుగుతుండడంతో బాలుడిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్తే.. వారు కటక్ తీసుకెళ్లాలని సూచించారు. కానీ నిరుపేద తల్లిదండ్రులకు ఆ స్థోమత లేదు. ప్రభుత్వం, దాతలే దయ తలచి తమ బిడ్డ కష్టాన్ని తీర్చాలని వారు కోరుతున్నారు.

– జయపురం

జన్మభూమిలో రాష్ట్రపతి పర్యటన



గురువుల ఆశీస్సులు అందుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



ఉపాధ్యాయినికి రాష్ట్రపతి సత్కారం



ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో రాష్ట్రపతి మాటామంతీ

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5 రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం ఆమె స్వస్థలాన్ని సందర్శించారు. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి పశ్చిమ బెంగాల్ కలైకొండ విమానాశ్రయం మీదుగా ప్రత్యేక విమానంలో మయూర్‌భంజ్ బాదంపహాడ్ రొంగామటియా హెలిప్యాడ్‌కు చేరారు. ఈ సందర్భంగా మయూర్‌భంజ్ జిల్లా స్వస్థలం ఉపర్‌బెడా స్వగృహంలో మధ్యాహ్నం భోజనం చేసి విద్యాభ్యాసం పొందిన ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు.

పాఠశాల మధుర స్మృతి

చిన్న నాట ప్రాథమిక విద్యా బోధన చేసిన పాఠశాల ప్రతి వ్యక్తి జీవితంలో మధుర స్మృతిగా రాష్ట్రపతి పేర్కొన్నారు. అలనాటి జ్ఞాపకాలు కనుల ముందు కదులాడుతున్నాయని ఆనంద భాష్పాలు రాల్చారు. విద్యాభ్యాసం పట్ల ఏమాత్రం అశ్రద్ధ వహించకుండా ఉజ్వల బాలలుగా ఎదగాలని పాఠశాల విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు.



ఉపాధ్యాయునికి రాష్ట్రపతి ఆత్మీయ సత్కారం

అంబేడ్కర్‌కు నివాళి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి రాష్ట్రపతి శ్రద్ధాంజలి ఘటించారు. రాజ్ భవన్ నుంచి బయల్దేరి స్థానిక ఏజీ కూడలి ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నరు రఘుబర దాస్ కూడ పాల్గొన్నారు.

ఏఓబీలో పులి



శోబర పంచాయతీ అంధారీ జుల్లో గ్రామంలో అటవీ అధికారులు



గుసాని సమితిలో పెద్ద పులి సంచారం

పర్లాకిమిడి: గజపతి–శ్రీకాకుళం జిల్లాల సరిహద్దులో తిరుగుతున్న పెద్ద పులి గురువారం శోబర పంచాయతీ అంధారీజుల్లో గ్రామంలో ఆవుపై దాడి చేసిందని గారబంద అటవీ శాఖ అధికారులు తెలియజేశారు. ఆవు కళేబరాన్ని అటవీ శాఖ అధికారులు ఖననం చేశారు. పెద్ద పులి సంచరిస్తున్న గారబంద, శోబర పంచాయతీలో అటవీ అధికారులు ట్రాకింగ్ కెమెరాలు పెట్టి గ్రామాల్లో ప్రజలకు పులిపై అవగాహన కల్పిస్తున్నారు.

కొడుక్కి పాము కాటు.. మద్యం మత్తులో తండ్రి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి మత్తిలి సమితి కర్తాన్‌పల్లి పంచాయతీ గుగపోధర్ గ్రామంలో శుక్రవారం పవాన్ మధిరా అనే 12 ఏళ్ల బాలుడు పాము కాటుతో మృతి చెందాడు. గురువారం రాత్రి ఇంటిలో నిద్రిస్తుండగా బాలుడిని పాము కాటు వేసింది. అతను పెద్దగా కేక వేసి చూడగా పాము వెళ్తూ కనిపించింది. ఆ సమయంలో బాలుడి తండ్రి మద్యం మత్తులో ఉండడంతో తల్లికి ఏం చేయాలో పాలుపోలేదు. దీంతో కర్తన్‌పల్లి సర్పంచ్ గోపి నాయక్‌కు ఫోన్ చేశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్దామని చెప్పారు. ఆ గ్రామానికి సరైన రహదారి సదుపాయం లేదు. ఎంతో కష్టపడి తీసుకుని వచ్చేసరికే బాలుడి ప్రాణాలు పోయాయి. దీంతో సర్పంచ్ గోపీనాయిక్ మత్తిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

కటక్ రైల్వే స్టేషన్ కొత్త భవనం రెడీ



ప్రారంభానికి సిద్ధమైన కటక్ రైల్వే స్టేషను కొత్త భవనం

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలం కటక్ రైల్వే స్టేషన్ తూర్పు వైపు నిర్మితమైన కొత్త భవనం శనివారం ప్రారంభం కానుంది. 16వ నంబరు జాతీయ రహదారి గుండా విచ్చేసే ప్రయాణికులకు ఈ ప్రవేశ మార్గం అత్యంత సౌకర్యవంతంగా ఉంటుంది. రూ. 303 కోట్ల వ్యయంతో కటక్ రైల్వే స్టేషను తూర్పు వైపు కొత్త భవనం నిర్మాణం పూర్తి చేశారు.

ధనలక్ష్మీ పూజలు ప్రారంభం



బిసంకటక్‌లో కొలువుదీరిన ధనలక్ష్మీ అమ్మవారు



కళ్యాణసింగుపూర్‌లో పూజలందుకుంటున్న లక్ష్మీ అమ్మవారు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్, కళ్యాణసింగుపూర్‌లలో ధనలక్ష్మీ పూజలు గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో సందడిగా కనిపిస్తున్నాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. కళ్యాణ సింగుపూర్‌లో ఏర్పాటు చేసిన పెండాల్ భక్తులను ఆకర్షిస్తుంది. తొమ్మిది రోజులు పూజలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



కళ్యాణసింగుపూర్‌లో ఏర్పాటు చేసిన పూజా పెండాల్

హోటళ్ల వద్ద వాహనాల పార్కింగ్ వద్దు

• యువకుల ఆందోళన



పోలీసు స్టేషన్ పక్కన ఉన్న హోటల్ వద్ద నినాదాలు చేస్తున్న యువకులు



రెండో హోటల్ వద్ద యువకుల ఆందోళన

జయపురం: స్థానిక 26వ నంబర్ జాతీయ రహదారిలో ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కు చేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సులు, ఇతర వాహనాల నిలుపుదలను నిషేధించిన తరువాత కూడా పారాబెడ జంక్షన్‌లోని రెండు పెద్ద హోటళ్ల ఎదుట వాహనాలను పార్కింగ్ చేస్తుండడపై ఆగ్రహం వ్యక్త చేశారు. స్థానిక యువకులు రెండు హోటళ్ల వద్దకు శుక్రవారం వెళ్లి వాహనాలను నిలపవద్దని హెచ్చరించారు. ఈ విషయంలో అధికారులు సైతం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సు స్టాండ్ ప్రారంభించిన తరువాత జాతీయ రహదారిలో బస్సులు, ఇతర వాహణాల పార్కింగ్‌పై ఆంక్షలు విధించడాన్ని యువత స్వాగతించింది. అయితే హోటళ్ల ఎదుట వాహనాలను పార్కింగ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కొంత మంది యువకులు పోలీసు స్టేషన్ పక్కన ఉన్న ఒక హోటల్ వద్దకు వెళ్లి వాహనాల పార్కింగ్ చేయవద్దంటూ నినాదాలు చేశారు. మరో హోటల్ వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. వాహనాల పార్కింగ్ కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు.

బస్సు, ట్రక్కు ఢీ.. పలువురికి గాయాలు



దుర్ఘటనలో నుజ్జునుజ్జయిన బస్సు



పిప్పిలి - జట్నీ మార్గంలో రాస్తా రోకోతో నిలిచిన వాహనాలు

భువనేశ్వర్: పూరీ జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బస్సు, ట్రక్కు ముఖాముఖి ఢీకొన్నాయి. బస్సులోని ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. 50 మంది పైబడి ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానిక ఆస్పత్రిలో వీరంతా చికిత్స పొందుతున్నారు. పూరీ జిల్లా పిప్పిలి–జట్నీ మార్గంలో ప్రయాణికులతో నిండిన బస్సు, ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనకు నిరసనగా స్థానికులు ఆందోళనకు దిగారు. వీరు నిర్వహించిన ఆందోళనతో పిప్పిలి–జట్నీ దారి స్తంభించిపోయింది. పోలీసులు చొరవ తీసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

క్లుప్తంగా

ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషన్ బిల్లు ఆమోదం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శుక్రవారం సభలో ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషన్ (అక్రమ మార్గాల నివారణ) బిల్లు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పూర్తి స్థాయి పారదర్శకతతో అక్రమ మార్గాల నివారణ లక్ష్యంగా కొత్త బిల్లుని ప్రతిపాదించినట్లు వివరించారు. ఈ మేరకు చర్యలు చేపట్టడంలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో భారీ స్థాయిలో లంచాల లావాదేవీలు చోటు చేసుకోవడంతో ఎందరో అమాయక ప్రజలు మోసపోయిన దాఖలాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషను బిల్లు తాజా సవరణతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అక్రమాలకు తెరపడుతుంది. అక్రమాలకు పాల్పడితే భారీ జరిమానాతో ఖైదు విధించేందుకు సవరణలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికల హామీ ప్రకారం రానున్న రోజుల్లో రాష్ట్రంలో 1 లక్ష 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. కొత్త చట్టం పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగించి నిరుద్యోగ యువతకు సుముచిత అవకాశం అక్కరకు రానుందని హామీ ఇచ్చారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం



ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ బలిగూడ గ్రామం వద్ద శుక్రవారం మత్తిలి ఎక్సైజ్ ఎస్‌ఐ సురేంద్ర మాఝి ఎనిమిది కిలోల గంజాయిని పట్టుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఈ గంజాయి బయటపడింది. ఈ గంజాయిని జైపూర్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కూడుములగుమ్మకు చెందిన కాలు నాయిక్, గోపాల్‌పూర్‌కు చేందిన సౌమ్యరంజాన్ మహాపాత్రో నిందితులని తెలిపారు. వీరిని శనివారం కోర్టుకు తరలిస్తామన్నారు.

27 కలప చెక్కలు స్వాధీనం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల అటవీ శాఖ వారు శుక్రవారం ఉదయం అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 27 కలప చెక్కలను స్వాధీనం చేసుకున్నారు. బంతల రాముడు, పాంగి రాజు, గోలారి త్రినోథలు కలప అక్రమంగా తరలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

మహిళ మృతదేహం లభ్యం



గురువారి దాసా మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితిలో ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న ఓ దుకాణం వద్ద శుక్రవారం ఉదయం మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి బలిమెల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఐఐసీ దీరాజ్ పట్నాయక్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. విచారణ చేయగా చనిపోయిన మహిళ ఖోయిర్‌పూట్ సమితి కుడుములగూమ్మ పంచాయతీకి చెందిన గురువారి దాసా (47)గా గుర్తించారు. ఈమె చాలా రోజులుగా కోరుకొండలో రోజుకూలీగా పని చేస్తోంది. ఈమె కుటుంబం కూడుములగూమ్మలో ఉంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కూడుములగూమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గురువారి దాసా మృతికి కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసలు చెప్పారు.

పాముకాటుతో మహిళ మృతి

టెక్కలి రూరల్: మండలంలోని గూడెం పంచాయతీ పిట్టలసరియా గ్రామంలో శుక్రవారం పాముకాటుకు గురై దాసరి రవణమ్మ(50)అనే మహిళ మృతి చెందింది. పొలంలో పనులు చేస్తుండగా విషసర్పం కాటు వేయడంతో స్థానికులు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తరలించారు. రవణమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం కూడలిలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బస్ షెల్టర్‌లో శుక్రవారం ఓ వ్యక్తి అపస్మారకంగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఇతను రణస్థలం మండలం బొద్దిపాడు గ్రామానికి చెందిన లొడగల రాము (38)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతిగా తాగటం వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డుల సేవలు మరువలేం

• ఘనంగా హోంగార్డుల దినోత్సవం



పర్లాకిమిడి: ఉత్తమ హోంగార్డు రాజు పడాలకు రివార్డు అందజేస్తున్న జిల్లా ఎస్పీ



పర్లాకిమిడి: రివార్డు అందుకుంటున్న హోంగార్డు బొమ్మాళి రవి

పర్లాకిమిడి: హోంగార్డులు ప్రజలకు అందిస్తున్న నిష్కల్మషమైన సేవలు అభినందనీయమని పర్లాకిమిడి జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా అన్నారు. హోంగార్డుల 62వ వార్షిక దినోత్సవాన్ని బెత్తగుడ వద్ద రిజర్వుడు పోలీసు పరేడ్ గ్రౌండ్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.ఎస్.పండా హోంగార్డులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వద్ద నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డులు ప్రజలకు ప్రాథమిక చికిత్స, అగ్నిప్రమాదాలు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో మెరుగైన సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం హోంగార్డుల కమాండెంట్ రాజు పడాల ఆధ్వర్యంలో పరేడ్ జరిపారు. జిల్లాలో హోంగార్డులు అందించిన సేవలకు గాను ఉత్తమ హోంగార్డులు రాజు పడాల, వంశీధర నాయక్, శంకర్రావు కళ్యాణి (పర్లాకిమిడి పీఎస్), బోమ్మాళి శివ, ఆర్.రవీంద్ర కుమార్ (కాశీనగర్), ప్రేమనంద లిమ్మా (కాశీనగర్ పీఎస్) తదితరులకు జిల్లా ఎస్పీ జిత్రేంద్ర పండా చేతులమీదుగా రివార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీవో మాధవనంద నాయక్, ఐఐసీ (ఆదర్శ పీఎస్) ప్రశాంత భూపతి పాల్గొన్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హోం గార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. దక్షిణ పశ్చిమాంచల్ డీఐజీ నితి శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై హోంగార్డుల జెండాను ఎగుర వేశారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డులు చేస్తున్న సేవలను కొనియాడారు. ఉత్తమ పని తీరు చూపించిన హోంగార్డులకు అవార్డులు అందజేశారు.



పర్లాకిమిడి: హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ పండా



పర్లాకిమిడి: హాజరైన హోంగార్డుల కమాండెంట్ రాజు పడాల



పర్లాకిమిడి: హోంగార్డు ఆర్.రవీంద్ర ప్రసాద్‌కు ప్రశంసా పత్రం, రివార్డు అందజేస్తున్న ఎస్పీ జితేంద్ర పండా



కొరాపుట్: ప్రసంగిస్తున్న డీఐజీ నితి శేఖర్



కొరాపుట్: కార్యక్రమంలో పాల్గొన్న హోంగార్డులు

ప్రారంభమైన పర్వ్ నాటక పోటీలు

• అలరించిన ప్రదర్శనలు



మహిషాసుర వధ నాటకంలో ఓ సన్నివేశం



మత్స్య రాణి నాటకంలో సన్నివేశం



చేపలు అమ్ముతున్న ఆదివాసీ దంపతుల సన్నివేశం

జయపురం: జయపురం గీతాంజలి మండపంపై కొరాపుట్ పర్వ–2024 ఆదివాసీ మహోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి జిల్లా స్థాయి నాటక పోటీలు ప్రారభమయ్యాయి. జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్యా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. మునిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్‌చైర్మన్ బి.సునీత, ఎంపీ ప్రతినిధి మనోజ్ ఆచారి, జిల్లా స్కాంస్కృతికి విశ్రాంత అధికారి కృష్ణచంద్ర నిశంఖ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. నాటక పోటీల న్యాయ నిర్ణేతలుగా కళాకారులు సుధాకర పట్నాయక్, ప్రశాంత మిశ్ర, బొరిగుమ్మ కళాకారుడు సురేష్‌రౌత్ వ్యవహరించారు. నాటక పోటీలలో బొయిపరిగుడ కళాకారులు నాట్య గురు బైతారి బిసారి దర్శకత్వంలో 'మహిషాసుర వధ'నాటకాన్ని ప్రదర్శించగా.. కొట్‌పాడ్ కళాకారులు 'మత్స్య రాణి'నాటకం ప్రదర్శించారు. కొట్‌పాడ్ దమయంతీ సాగర్ పరిసర ప్రాంతాలలో నిసిస్తున్న ఆదివాసీ ప్రజల జీవనంపై సాగిన నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మహిషాసుర వధ నాటకంలో కళాకారుల నటన చూపరులను అలరించింది. నాటక పోటీలు ఈ నెల ఎనిమిదో వరకు కొనసాగుతాయని నిర్వాహకులు ప్రియ ఎంటర్ గ్రూపు జయపురం వారు వెల్లడించారు.

చేతిలో బాంబు పేలి యువకుడికి గాయాలు

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిఆంధ్ర వీధికి చెందిన దేవాది సాయి అనే యువకుడు బాంబు పేలుడులో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పంట పొలాల్లో చొరబడుతున్న అడవి పందులను చంపేందుకు సాయి గురువారం రాత్రి తన పాత ఇంటి వద్ద నాటుబాంబులు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. చేతి వేళ్లు తెగిపడి తీవ్రంగా గాయపడటంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖపట్నంకి తరలించనున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి టెక్కలి సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. పుష్ప–2 సినిమా థియేటర్ వద్ద బాంబులు కాలుస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఫిర్యాదు అందిందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలవరంపై రభస

భువనేశ్వర్: పోలవరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో రభస చోటు చేసుకుంది. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా నీట మునుగుతుంది. రాష్ట్ర ప్రయోజనాలకు పక్కన బెట్టి కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష ధోరణితో వెళ్తోందని విపక్ష బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు ప్రత్యక్షంగా ఎదురు దాడికి దిగారు. దీనిపై బీజేపీ కూడా దీటుగా సమాధానం చెప్పింది.

పోలవరం ప్రాజెక్టుపై చర్చకు కాంగ్రెసు సభలో వాయిదా తీర్మానం ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం నోటీసు జారీ చేసింది. దీనిపై చర్చకు స్పీకరు నిరాకరించడంతో భగ్గుమంది. స్పీకరు పొడియం చుట్టుముట్టి సభలో రభస రేపారు. సభని అదుపులోకి తీసుకుని సజావుగా నడిపించాలని బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ తన స్థానంలో నిలబడి స్పీకరుని అభ్యర్థించారు. స్పీకరు చర్యలు శూన్యం కావడంతో కాంగ్రెసు నినాదంతో విపక్ష నేత నవీన్ పట్నాయక్ గళం కలిపారు.

పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా విపరీతంగా ప్రభావితం అవుతుందని, ప్రాజెక్టు డిజైన్ సవరణతో ఈ ముప్పుని నివారించాలని బీజేడీ ఆది నుంచి చెబుతోందని, తాజాగా ప్రత్యేక ప్రతినిధి బృందం న్యూ ఢిల్లీ సందర్శించి కేంద్ర జల కమిషను సీడబ్ల్యూసీతో ప్రత్యక్షంగా సంప్రదించిందని, పోలవరం ప్రాజెక్టుతో తలెత్తబోయే ముప్పుని వివరించిందని తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం విపక్ష హోదాలో బిజూ జనతా దళ్ నిరంతరం తన పోరుని కొనసాగిస్తుందని నవీన్ పట్నాయక్ ప్రకటించారు.

ప్రజా ప్రయోజనాలకు ప్రభుత్వ హామీ ఉంటుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి లిఖితపూర్వకంగా సభలో ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా ప్రభావితం అవుతుందని ముఖ్యమంత్రి సభలో అంగీకరించారు. అయితే 2 రాష్ట్రాల మధ్య గోదావరి జల పంపిణీ వివాద ట్రిబ్యునల్ ఆధీనంలో ఒప్పందం కుదిరిందని చెప్పారు.



స్పీకరు పొడియం చుట్టుముట్టిన విపక్షాలు

పోలవరం నష్టాలపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని కాంగ్రెసు శాసన సభ నాయకుడు రామచంద్ర కదమ్ సభలో ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, పోలవరం ప్రాజెక్టు కోసం అంగుళం భూమి కూడా కేటాయించేది లేదని అధికార పక్షం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే అశోక్ మహంతి అభయం ఇచ్చారు. గత 24 ఏళ్లలో అప్పటి నాయకులు ఏమీ చేయలేదని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ ఎదురు దాడికి దిగారు.

సభా కార్యక్రమాలు ఆరంభం కావడంతో పోలవరం ప్రాజెక్టుపై ప్రతిపాదించిన వాయిదా తీర్మానంపై చర్చకు కాంగ్రెసు నిలదీసింది. స్పీకరు నిరాకరించడంతో సభ్యులు స్పీకరు పొడియం చుట్టుముట్టారు. ఈ ప్రాజెక్టుపై వివాదం న్యాయ సంస్థల అధీనంలో విచారణ కొనసాగుతున్నందున సభలో చర్చించేందుకు అవకాశం లేనందున ప్రతిపాదిత వాయిదా తీర్మానంపై చర్చకు నిరాకరించినట్లు స్పీకరు సురమా పాఢి నచ్చజెప్పారు.

అంచెలంచెలుగా సభ వాయిదా

విపక్షాల దాడితో సభలో యుద్ధ వాతావరణం నెలకొంది. సభా కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుకూలత లేకపోవడంతో తొలుత మధ్యాహ్నం 11.30 గంటల వరకు స్పీకరు వాయిదా వేసినట్లు ప్రకటించారు. అప్పటికి పరిస్థితి సద్దుమణగక పోవడంతో తిరిగి సాయంత్రం 4 గంటల వరకు సభా కార్యకలాపాల్ని వాయిదా వేశారు.

హిందువులపై హింసాకాండ దారుణం

• బంగ్లాదేశ్‌లో దాడులను ఖండిస్తూ హిందూ సురక్షా మంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ



పర్లాకిమిడిలో ర్యాలీ చేస్తున్న వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సభ్యులు



కలెక్టరేట్ వద్ద వీహెచ్‌పీ, భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు



ఏడీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ ప్రతినిధులు

పర్లాకిమిడి: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అత్యాచారాలు, ఇస్కాన్ ప్రధాన సేవకులు చిన్మయి క్రిష్ణదాస్ అరెస్టుకు నిరసనగా పర్లాకిమిడి పట్టణంలోని రాజవీధిలో జగన్నాథ మందిరం నుంచి గజపతి హిందూ సురక్షామంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ చేశారు. ర్యాలీలో వీహెచ్‌పీ ప్రాంతీయ సమరసత్తా తరిణీ సేన్ దాస్, గజపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఆవాహక్ రామక్రిష్ణ జన్ని, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు పూర్ణచంద్ర మహాపాత్రో, మహేంద్రగిరి భాస్కరతీర్థ లక్ష్మీబాబా, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి లోకనాథ మిశ్రా, పట్టణ అధ్యక్షులు కైలాష్ పట్నాయక్, కైలాష్ చంద్ర గౌడో (ఆర్గనైజింగ్ సెక్రటరీ), భజరంగ్ దళ్ జిల్లా కార్యదర్శి మనోజ్ దాస్, హరిమోహన్ పట్నాయక్, మహాంత రామానంద దాస్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బంగ్లాదేశ్ నుంచి వలసవచ్చిన బంగ్లా, రోహింగ్యా శరణార్థులను వెళ్లగొట్టాలని, ఇస్కాన్ ప్రధాన సేవకులు చిన్మయి క్రిష్ణదాస్‌ను బేషరతుగా విడిచి పెట్టాలని, గజపతి జిల్లాలో ఉన్న బంగ్లా శరణార్థులను వెడలగొట్టాలని వీహెచ్‌పీ జిల్లా నాయకులు పూర్ణచంద్ర మహాపాత్రో డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన జరిపారు. అనంతరం ఆదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్రమింజ్‌కు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి, హోం సెక్రటరీలను ఉద్దేశిస్తూ రాసిన వినతులను అందజేశారు.



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న మహేంద్రగిరి లక్ష్మీబాబా



గజపతి సురక్షామంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ



బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాకాండను ఖండిస్తూ సాగుతున్న ర్యాలీ

రాజ్యసభ రేసులో లేను

• మన్మోహన్ సామల్



మన్మోహన్ సామల్

భువనేశ్వర్: రాష్ట్రంలో ఒక రాజ్యసభ స్థానం ఖాళీగా ఉంది. దీని భర్తీ కోసం త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. విజయం సాధించేందుకు అధికార పక్షానికి కావాల్సిన సంఖ్యా బలం ఉంది. అయితే ఆ స్థానానికి ఎవరూ పోటీ చేస్తారనే విషయంపై సందిగ్ధత నెలకొంది. ఇటీవల కాలంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ రాజ్యసభ పోటీకి సిద్ధం అవుతున్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే వీటిపై శుక్రవారం ఆయన స్పందించారు. రాజ్యసభ ఉప ఎన్నిక రేసులో తాను లేనట్లు స్పష్టం చేశారు. అయితే బీజేపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం మేరకు అభ్యర్థి ఖరారు కానున్నట్లు ప్రకటించారు. ఈనెల 20వ తేదీన రాష్ట్రంతో పాటు మరో 4 రాష్ట్రాల్లో రాజ్యసభ ఉప ఎన్నిక జరగనుంది. రాష్ట్రం నుంచి బీజేడీ అభ్యర్థి సుజిత్ కుమార్ రాజీనామా చేయడంతో ఎగువ సభలో స్థానం ఖాళీ అయింది. ఈనెల 10వ తేదీతో రాజ్యసభ ఉప ఎన్నిక నామినేషను దాఖలు గడువు పూర్తి అవుతుంది. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన ముగించి పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితా వెల్లడిస్తారు. పోటీ నుంచి వైదొలిగేందుకు ఈనెల 13వ తేదీ వరకు గడువు కల్పించినట్లు నోటిఫికేషను జారీ అయిన విషయం తెలిసిందే.

అలంకరణలో అమ్మవారు



శ్రీకాకుళం నానుబాలవీధిలో విజయదుర్గా దేవిని మార్గశిర మాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

క్లుప్తంగా

నేడు మెగా పేరెంట్స్‌డే మీటింగ్

● కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించే మెగా పేరెంట్స్‌డే మీటింగ్‌ను విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పేరెంట్స్‌డే మీటింగ్‌కు పాఠశాల ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని, పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాప్రమాణాలు, హాజరు శాతం తదితర అంశాలను చర్చించాలని కోరారు. విద్యార్థులకు ఆరోగ్య వివరాలతో ఆరోగ్య కార్డులను అందిచాలన్నారు. మంచి ఫ్లెక్సీలను ఏర్పాటుచేయాలని, వాటిమీద ఎవరి ఫోటో ఉండకూదని స్పష్టం చేశారు. రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, టెన్నికాయిట్ తదితర ఆటలను తల్లిదండ్రులకు నిర్వహించాలని, కార్యక్రమాలలో యాంకర్‌లుగా విద్యార్థులు వ్యవహరించాలన్నారు. మొత్తం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ తయారు చేయాలని, ఉత్తమ పాఠశాలకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ


స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం సీతారామచంద్రస్వామిని అర్చకులు నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదిక వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం దీపాలంకరణ వేడుకను ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక ఊయలలో స్వామి వారిని వేంచేపు చేసి దీపపు కాంతుల వెలుగుల్లో ఊంజల్ సేవతో పాటు అష్టోత్తర శత నామావళి అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు పేకాట రాయళ్లకు సోషల్ సర్వీస్ శిక్ష

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో పేకాట ఆడుతూ పట్టుబడిన నిందితులకు కోర్టు వినూత్న రీతిలో శిక్షను ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సై గణేష్ మాట్లాడుతూ..గత నెల 17న ఒమ్మి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టుకు అప్పగించామన్నారు. కోర్టులో విచారణ అనంతరం ముద్దాయిలకు సోషల్ సర్వీస్ శిక్షను విధిస్తూ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారన్నారు. ఇందులో భాగంగా రెండు రోజులు ఆస్పత్రిలో, మరో రెండు రోజులు పాఠశాలల్లో క్లీన్ అండ్ గ్రీన్ పనులు చేపట్టాలని తీర్పు ఇచ్చారని ఎస్సై తెలిపారు.

రీజనల్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభం


మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ స్వామినాయుడు

విజయనగరం అర్బన్: అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాన్ని కళాశాల స్థాయి నుంచే మెరుగుపరుచుకోవాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని రీజనల్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక విద్యలో అత్యాధునిక నైపుణ్యం ఉన్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని అన్నారు. కళాశాల స్థాయి నుంచి ఆ దృక్పథంలో విద్యను అభ్యసించాలని సూచించారు. అకడమిక్ చదువుతోపాటు టెక్ ఫెస్ట్‌ల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీజియన్ సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, జేఎన్‌టీయూ మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరావు,వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరటితోటలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు అరటితోటలో శుక్రవారం ఏనుగుల గుంపు దర్శనమిచ్చింది. కుందరతిరువాడ, పరజపాడు పంట పొలాల్లో రెండు రోజుల నుంచి ఏనుగులు తిరగడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. అరటి, వరి పంటకు నష్టం కలిగిస్తున్నాయని వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ

● బంగారు భవిష్యత్తుకు భరోసా
● జిల్లాలో 15 కేంద్రాల ద్వారా సేవలు
● మెలకువలతో కూడిన తర్ఫీదుతో మానసిక వికాసం


బుద్ధిమాంద్యంతో ఇబ్బంది పడుతున్న పిల్లలకు శిక్షణ ఇస్తున్న ఐఈఆర్టీ



భవితా కేంద్రం ద్వారా ప్రత్యేక ఆవసరాలుగల పిల్లకు అందిస్తున్న సేవలు

పాలకొండ రూరల్: శారీరకంగా, మానసికంగా ఎదుగుదల సరిగా లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారుల భవిష్యత్ తల్లిదండ్రులకు ఒక సవాల్‌గా నిలుస్తోంది. ఆ చిన్నారులను వైద్యశాలల చుట్టూ తిప్పుతూ ఆర్థికంగా, మానసికంగా తల్లిదండ్రులు కుంగిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో భవిత కేంద్రాలతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల భవితవ్యానికి భరోసా కలుగుతోంది.

భవిత కేంద్రాల ద్వారా స్వాంతన..

పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 15 భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా గత ఏడాది నుంచి 1,220 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు నిత్యం మానసిక పరివర్తనతో కూడిన విద్యను అవలంబిస్తూ స్వాంతన పొందుతున్నారు. వారిలో బాలురు 656మంది, బాలికలు 564 మంది ఉన్నారు. తాజాగా ఈ సంవత్సరం సర్వశిక్ష అభియాన్ ద్వారా నిర్వహిస్తున్న సర్వేలో జిల్లావ్యాప్తంగా 1,715 మందికి పైగా చిన్నారులు ఉండడాన్ని గుర్తించారు. భవిత కేంద్రంలో పలువురు చిన్నారులకు సహిత విద్యనందించడమే కాకుండా వారి వైకల్యాన్ని తగ్గించేందుకు, ఇతర చిన్నారులతో కలిసేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఈ తరహా చిన్నారులు ప్రత్యేకం...

పూర్తి అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, భాషణ లోపం, చలన వైకల్యం, మానసిక వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మెదడు పక్షవాతం, ఆటిజం, బహుళ వైకల్యం, కుష్టువ్యాధిగ్రస్తులు, మరుగుజ్జుతనం, దీర్ఘకాలిక నరాల సమస్య, కండరాల క్షీణత, బహుళ నాడీ వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హిమోఫీలియా, కొడవలి కణ రక్తహీనత, మెదడు నుంచి నరాల బలహీనత వంటి వారందరూ ప్రత్యేక అవసరాలుగల చిన్నారులుగా గుర్తింపబడతారు. ఈ తరహా 21 రకాల సమస్యలను ప్రశస్థ యాప్ ద్వారా పాఠశాలలో గుర్తించేలా చర్యలు చేపట్టారు. గుర్తించిన సమస్యలను అధిగమించేలా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

సహిత విద్య విభాగం ద్వారా శిక్షణ..

ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నాదులకు వైకల్యం శాతం పెరగకుండా, ఉన్న వైకల్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఏర్పడిన సహిత విద్య విభాగం ద్వారా భవిత కేంద్రాలు అనేక రకాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

● ఈ కేంద్రాలలో ఇద్దరు ప్రత్యేక ఉపాధ్యాయులతో పాటు ఫిజియోథెరపిస్ట్, స్పీచ్ థెరపిస్ట్, సైకాలజిస్ట్, ఒక సీజీవీ చిన్నారులకు సేవలు అందిస్తుంటారు.
● స్పెషల్ ఎడ్యుకేటర్లు బొమ్మలు, ప్లకార్డులు, పజిల్స్ చూపుతూ మానసిక పరివర్తనతో కూడిన విద్యలో శిక్షణ అందిస్తుంటారు.
● ఒక్కొక్కరికి కొంత సమయాన్ని కేటాయిస్తూ వారి మానసిక స్థితికి అనుగుణంగా అర్థమయ్యే విధంగా శిక్షణ ఇస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. మాటలు, ఫిజియోథెరపీ, బిహేవియర్ మాడిఫికేషన్ థెరపీ.

తదితర సేవలు అందిస్తుంటారు.

● భవిత కేంద్రాలకు వచ్చేవరకు వారి పనులు చేసుకోలేని స్థితిలో, కనీసం ఎదుటి వారిని అర్థం చేసుకోలేని పరిస్థితి నుంచి తమ పనులు తామే చేసుకునే స్థాయికి చేరుకుంటున్నారు.
● ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతికత ఎంతో ముఖ్యమైనది. దీంతో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ట్యాబ్‌లు, కంప్యూటర్‌ను ఉపయోగించే విధంగా భవిత స్కూల్స్ నిర్వాహకులు శిక్షణ ఇస్తూ చైతన్యపరుస్తున్నారు.

సర్కారు పాఠశాలలో బోధన



జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించే ప్రక్రియను నిరంతరం నిర్వహిస్తున్నాం. ఇటువంటి చిన్నారులు ఉంటే తల్లిదండ్రులు, సంరక్షకులు సమాచారం అందించి చిన్నారుల అభ్యున్నతికి భాగస్వాములు కావాలి. గతంలో ఈ చిన్నారులకు ప్రత్యేకంగా పాఠశాలలు ఉండేవి. ప్రస్తుతం సాధారణ పిల్లలతో కలిసి చదువుకోవాలన్న లక్ష్యంతో సర్కారు పాఠశాలలోనే భవిత కేంద్రాలను నెలకొల్పి అక్కడే ప్రత్యేక, సాధారణ ఉపాధ్యాయులతో సహిత విద్యా లక్ష్యాలకు అనుగుణంగా బోధన అందిస్తున్నాం. ప్రశస్థ యాప్ ద్వారా 21 రకాల స మస్యలతో కూడిన పిల్లను గుర్తించి సేవలు విస్తృతం చేస్తున్నాం.

పి.భానుమూర్తి, సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్, పార్వతీపురం మన్యం

మానసిక, శారీరక ఎదుగుదలకు



ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, అభ్యున్నతికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తున్నాం. కేంద్రానికి వచ్చిన సమయానికి, ప్రస్తుతం పాఠశాలలో అభ్యసిస్తున్న సమయానికి పిల్లల మానసిక ప్రవర్తనలో పురోగతి కనిపిస్తుంది. చిన్నారులు సహ విద్యార్థులతో మాట్లాడడం, చదవడంచేస్తున్నారు. వారి ప్రవర్తనలో మార్పు రావడం ఆనందంగా ఉంది. ఈ చిన్నారులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులను చైతన్యపరిచి పిల్లలు కేంద్రానికి వచ్చే విధంగా కృషిచేస్తున్నాం. అవసరమైతే వారి ఇళ్ల వద్దకు వెళ్లి సేవలు కొనసాగిస్తున్నాం.

ముదిలి అరుణ, ఐఈఆర్టీ, పాలకొండ భవిత కేంద్రం

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

● డైట్ ప్రిన్సిపాల్ పగడాలమ్మ
● ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా కళాఉత్సవ్ పోటీలు


ఫస్ట్‌ప్రైజ్ సాధించిన విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

నెల్లిమర్ల: విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికితీయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఉందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో ఉమ్మడి విజయనగరం జిల్లా కళాఉత్సవ్ 2024–25 పోటీలు శుక్రవారం ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన 50 పాఠశాలల నుంచి 168 విద్యార్థులు ఆసక్తికరంగా పోటీల్లో పాల్గొన్నారు. గాత్రసంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయక కథలు చెప్పడం అనే అంశాలలో ఈ పోటీలు నిర్వహించారు. గాత్ర సంగీతంలో ఎన్.యోజిత (మొయిద), వాయిద్య సంగీతంలో బి.శివాత్మిక(విజయనగరం), నృత్యంలో బి.గాయత్రి అండ్ టీమ్(అంబేడ్కర్ గురుకులం), నాటకంలో పి.సురేంద్ర అండ్ టీం(మొయిద), దృశ్యకళలో పి. సౌజన్యమణి(ఎంజేపీఏపీ గురుకులం,నెల్లిమర్ల), సంప్రదాయక కథలు చెప్పడంలో ఎస్.యోగశ్వని, బి.నవ్య(ఎంజేపీఏపీ గురుకులం,నెల్లిమర్ల) ప్రథమ బహుమతులు సాధించారు. ఈ పోటీలకు ఎం.ఆదియ్య, వి.నారాయణమూర్తి, ఏవీఆర్‌డీ ప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలు డైట్‌లెక్చరర్లు పి. రవికుమార్, కె.సూర్యారావు, ఎల్ రామకృష్ణారావుల సారథ్యంలో జరిగాయి. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.ఈశ్వరరావు, వీవీజేఎస్ సుబ్రహ్మణ్యం, ఎ శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, వి.భారతి, కార్యాలయం పర్యవేక్షకురాలు కమలకుమారి పాల్గొన్నారు.

అంతా వారిష్టం..!

● మధ్యాహ్నమే కార్యాలయం మూసివేత
● తెరుచుకోని ఖాదీగ్రామీణ ప్రభుత్వ కార్యాలయం
● కొద్ది రోజులుగా ఇదే వరస


మధ్యాహ్నానికే మూసి ఉన్న కార్యాలయం

విజయనగరం రూరల్: అర్హులైన వారందరికీ గ్రామాల్లో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకునేందుకు రాయితీలు కల్పిస్తాం. ఆసక్తి ఉన్న వారంతా జిల్లా కేంద్రంలోని ప్రదీప్ నగర్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని ఒకవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతుంటే ఇక్కడి కార్యాలయ సిబ్బంది మాత్రం వారికి నచ్చినప్పుడు కార్యాలయం తెరవడం, లేనప్పుడు మిట్టమధ్యాహ్నానికే మూసివేయం చేస్తున్నారు. ప్రధానంగా జిల్లా అంతటికీ ఒకేఒక కార్యాలయం అయ్యినప్పటికీ కార్యాలయంలో ఉన్న ఆఫీస్ సబార్డినేట్, కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ లలో శుక్రవారం ఏ ఒక్కరూ కార్యాలయంలో లేకపోవడంతో పాటు కార్యాలయానికి తాళాలు వేసి ఉండడం చూస్తుంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏ తీరులో ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలు మిట్టమధ్యాహ్నమే మూసివేయడంపై స్థానికులు నవ్వుకుంటున్నారు. ఇదేనా ప్రభుత్వ పాలనతీరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత కార్యాలయం ఎ.డి మురళీకృష్ణ వద్ద సాక్షి ప్రస్తావించగా కార్యాలయం తెరిచే ఉంచాలని, మూసివేసినట్లు తనకు తెలియదన్నారు. ఉన్న సిబ్బంది ముగ్గురు అవుట్ సోర్సింగ్‌కు చెందిన వారే అయినప్పటికీ కార్యాలయం మూసి ఉంచరాదని స్పష్టం చేశారు. తాను కార్యాలయం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నానని తెలిపారు.

పోలీస్‌శాఖలో హోంగార్డ్స్ సేవలు క్రియాశీలకం


హోంగార్డుల గౌరవవందనం స్వీకరిస్తున్న అదనపు ఎస్పీలు

● పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా 62వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం
● పోలీస్‌శాఖకు హోంగార్డ్స్ చేస్తున్న సేవలను కొనియాడిన అదనపు ఎస్పీ సౌమ్యలత


పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పోలీస్ వ్యవస్థలో పోలీసులతో సమానంగా అన్ని రకాల విధులను నిర్వహిస్తూ హోంగార్డ్స్ క్రియాశీలకంగా మారారని జిల్లా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం 62వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సౌమ్యలత, ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు హాజరై హోంగార్డ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సౌమ్యలత మాట్లాడుతూ అన్నిరకాల బందోబస్తులు, ముఖ్యవ్యక్తుల భద్రత, శాంతి భద్రతలు, ట్రాఫిక్ విభాగాల్లో హోంగార్డులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని కంప్యూటర్ ఆపరేటర్లుగా, డ్రైవర్లగా పనిచేస్తుండడం అభినందనీయమన్నారు. నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. హోంగార్డ్స్ సంక్షేమానికి ఎస్పీ వకుల్‌జిందాల్ కృషిచేస్తున్నట్టు వెల్లడించారు. ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖను రాష్ట్రంలోనే ఉత్తమంగా నిలపడంలో హోంగార్డుల పాత్ర ఉందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డ్స్‌కు, నీట్ టర్నవుట్, పరేడ్ నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డ్స్‌కు బహుమతులను ప్రదానం చేశారు. ఇటీవల మృతిచెందిన హోంగార్డ్స్ కుటుంబాలకు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరఫున రూ.3 వేలు చొప్పున చెక్కులను హోంగార్డుల కుటుంబాలకు అందజేశారు. పరేడ్ కమాండర్‌గా ఎం.శివసంతోష్ నిర్వహించారు. అనంతరం హోంగార్డుల ర్యాలీకి అదనపు ఎస్పీలు పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హోంగార్డ్స్ విధులు, సేవలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

సూక్ష్మ సేద్యంపై శీతకన్ను

● బిందు, తుంపర సేద్యానికి ప్రోత్సాహం కరువు
● లక్ష్యం అధికం... ఆచరణ అంతంతమాత్రమే..
● ఈ ఏడాది సూక్ష్మసేద్యం సాగులక్ష్యం 3,050 హెక్టార్లు
● దరఖాస్తు చేసిన రైతుల సంఖ్య: 705
● యూనిట్లు మంజూరు: 86
● సాగునీటి కొరత ప్రాంతాల్లో సాగని సాగు


సోపేరులో బిందుసేద్యం వినియోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా పీడీ లక్ష్మీనారాయణ

రాజాం: సూక్ష్మసేద్యం... తక్కువ సాగునీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు పద్ధతి. ఇది రైతులకు లాభదాయకం. సాగునీటి కొరత ఉన్న ప్రాంతాల రైతులకు అనువైనది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సూక్ష్మసేద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుపై దృష్టిసారించింది. ఇందుకోసం అందుబాటులో ఉన్న సాంకేతికతను వ్యవసాయానికి జోడించింది. ఇందులో భాగంగా ప్రతీ రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు బిందు, తుంపర సేద్యానికి సంబంధించి అవగాహన కల్పించడంతో పాటు రాయితీపై స్ప్రింక్లర్ పైపులు అందించింది. ఈ పథకం మంజూరీలో ఎటువంటి దళారీ వ్యవస్థ ఉండేది కాదు. రైతుకే నేరుగా పథకం లబ్ధి చేరేది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 2019–24 మధ్య కాలంలో బిందు, తుంపర సేద్యం పెరిగింది. నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా రబీ సాగు సైతం చేసి రైతులు లబ్ధిపొందేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తొలి ఆర్థిక సంవత్సరంలోనే సూక్ష్మ సేద్యానికి బ్రేక్ పడింది. పథకం యూనిట్ల మంజూరు సకాలంలో జరుగకపోవడంతో 2024–25 ఆర్థిక సంవత్సరంలో బిందు, తుంపర సేద్యాల లక్ష్యం పదిశాతం కూడా చేరుకోలేని పరిస్థితి కనిపిస్తోంది.

జిల్లాలో 3,050 హెక్టార్లు లక్ష్యం..

జిల్లా వ్యాప్తంగా వాణిజ్య, ఉద్యానవన పంటలు అధికంగా ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 3,050 హెక్టార్లలో 2,300 మంది రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటివరకూ 705 మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా, వీరిలో 86 మందికి మాత్రమే పథకం మంజూరు చేశారు. మొత్తం 845 ఎకరాలకు సంబంధించి దరఖాస్తు చేయగా, కేవలం 106 ఎకరాల్లో మాత్రమే ఈ పరికరాలు మంజూరయ్యాయి. 2003–04 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో సూక్ష్మ సేద్యం ప్రారంభం కాగా, గత ఆర్థిక సంవత్సరం వరకూ 9,563 మంది రైతులు మొత్తం 10,588 హెక్టార్లలో పంటలు సాగుకు ఈ పరికరాలను రాయితీపై పొందారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ పరికరాలు మంజూరును ఆగస్టు నెల అనంతరం మంజూరుచేయడంతో, అప్పటికే ఖరీఫ్ ప్రారంభం కావడంతో రైతులు వెనుకడుగువేశారు.


మొక్కకు బిందు సేద్యంతో నీటిని అందిస్తున్న దృశ్యం

ఈ పంటలకు..

బిందు సేద్యం పరికరాలను అరటి, బొప్పాయి, జామ, చెరకు, కూరగాయల, సపోట, పత్తి, కొబ్బరి, మామిడి, జీడి, మిరప, ఉల్లి, పూలతోటలు, ఆయిల్‌పాం పంటలకు అందిస్తారు. తుంపర సేద్యం పరికరాలను అపరాలు, వేరుశనగ, నువ్వులు, ఆకుకూరల పంటల సాగుకు అందజేస్తారు.

70 శాతం నీటి ఆదా..

సాధారణంగా ఉద్యానవన పంటల విభాగంలోకి వచ్చే మామిడి, జీడి, జామ, పైనాపిల్, పామాయిల్ వంటి పంటలన్నింటికీ ఆయా పంటపొలాలు సమీపంలో నేలబావులు, బోరుబావులు ఉంటాయి. కూరగాయలు సాగుచేసే రైతులు కూడా తమ పంటపొలాలు సమీపంలో బావులు ఏర్పాటుచేసుకుంటారు. వీరు ఆయిల్ ఇంజిన్లు, ఎలక్ట్రికల్ పంపుసెట్లు ద్వారా నీటిని పంటలకు తరలిస్తుంటారు. వీటికారణంగా అధికంగా నీటి వినియోగం జరుగుతుంది. ఇటువంటి ప్రాంతాల్లో రైతులు బిందుసేద్యాన్ని అవలంబిస్తే కేవలం 30 శాతం నీటితో పంటలు సాగుచేసుకోవచ్చు. అంతేకాకుండా మండు వేసవిలో కూడా నీటి ఇబ్బందులను అధిగమించవచ్చు. తుంపర సేద్యం ద్వారా ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా వాణిజ్య పంటల సాగులో లాభాలు పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

రాయతీ ఉన్నా... అవగాహన సున్నా...

బిందు సేద్యం చేసే రైతులకు 90 శాతం రాయితీ వస్తుంది. ఐదు ఎకరాల్లోపు ఉంటే ఈ రాయితీ ఉండగా. ఐదెకరాలు దాటిన రైతులకు 50 శాతం రాయితీ ద్వారా పైపులు అందిస్తున్నారు. తుంపర సేద్యానికి సంబంధించి ఐదెకరాల్లోపు ఉంటే 55 శాతం రాయితీ, ఐదెకరాలు దాటి ఉంటే 45 శాతం రాయితీ ఇస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో వీటికి దరఖాస్తుచేయాలి. మెట్టభూములు, నేలబావులు, పంటకాలువలు ఉన్నచోట ఆరుతడి పంటలకు ఈ సూక్ష్మ సేద్యం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పథకానికి సంబంధించి రైతులకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్న ఆరోపణలు ఉన్నాయి. యూనిట్లు సకాలంలో మంజూరుకాకపోవడం సాగుకు శాపంగా మారింది. ఇదే విషయాన్ని మైక్రోఇరిగేషన్ ప్రాజెక్టు జిల్లా పీడీ వీఎస్‌వీ లక్ష్మీనారాయణ వద్ద 'సాక్షి' ప్రస్తావించగా, గ్రామాల్లో రైతులకు బిందు, తుంపర సేద్యాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాలు ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని వెల్లడించారు. ఈ ఏడాది పరికరాలు ఆలస్యంగా మంజూరు కావడంతో లక్ష్యం చేరుకోలేకపోతున్నామని తెలిపారు.

అవగాహన లేదు



బిందు, తుంపర సేద్యాలపై గ్రామాల్లో రైతులకు అవగాహన లేదు. ఆర్‌ఎస్‌కేల్లో దరఖాస్తు చేసుకుందామనుకున్నా ప్రాసెస్ అవ్వడంలేదు. ఈ ఏడాది మా పంచాయతీ నుంచి ఒకరిద్దరు రైతులం ఈ పరికరాలు నిమిత్తం ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో దరఖాస్తు చేయకుండా వదిలేశాం.

– రెడ్డి స్వామినాయుడు, మోదుగులపేట, సంతకవిటి మండలం

యూనిట్లు సకాలంలో మంజూరు కావట్లేదు



బిందు, తుంపర సేద్యం పరికరాలు సకాలంలో మంజూరుకావడంలేదు. గతంలో ఆర్‌బీకేలు వద్ద జవాబుదారీతనం ఉండేది. ఇప్పుడు ఈ పథకాలు గురించి చేర్పులు మార్పులు జరిగాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పథకంపై అవగాహన తక్కువ కావడంతో పాటు రైతులు కూడా ఈ పథకం ద్వారా పరికరాలు వస్తాయో రావో అనే సందేహంతో పెద్దగా ఆసక్తి చూపలేదు.

– వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్, అంతకాపల్లి, రాజాం మండలం

సీనియర్స్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లు పయనం


సీనియర్స్ కబడ్డీ పోటీలకు పయనమవుతున్న జిల్లా జట్లతో అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సీనియర్స్ స్త్రీ, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు శుక్రవారం పయనమయ్యాయి. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఐవీపీ రాజు చేతుల మీదుగా క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ కార్యదర్శి కె.వి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.